వేసవి వచ్చింది.. జరభద్రం

- అగ్ని ప్రమాదాలు జరిగే అవకాశం
- ముందు జాగ్రత్తలే శ్రీరామరక్ష
- వంటింట్లో నిర్లక్ష్యం ప్రమాదం
- ఈ నెల 20 వరకూ అగ్ని ప్రమాదాల నివారణ వారోత్సవాలు

గత నాలుగేళ్ల ప్రమాదాల వివరాలు

సంవత్సరం	ప్రమాదాలు	ఆస్తి నష్టం	కాపాడిన ఆస్తి
2019-2020	93	రూ.14,37,61,968	రూ.25,78,93,532
2020-2021	52	రూ.2,38,42,000	రూ.5,74,56,000
2021-2022	42	రూ.1,25,81,000	రూ.1,79,79,000
2022-2023	55	రూ.1,17,88,500	రూ.1,96,70,000
	242	రూ.19,19,73,468	రూ. 35,29,98,532

బిక్కవోలు: కట్టెల పొయ్యికి కాలం చెల్లింది. గ్యాస్‌స్టవ్ వచ్చింది. ఏ ఇంట్లో చూసినా గ్యాస్‌స్టవ్ దర్శనమిస్తోంది. వీటి వినియోగంపై అవగాహన లేక కొందరు ప్రమాదాల బారిన పడుతున్నారు. అలాగే ఎండాకాలం అధిక ఉష్ణోగ్రతలతో ఏదో ఒక చోట అగ్ని ప్రమాదాలు జరుగుతునే ఉంటాయి. విద్యుదాఘాతం, సిగిరెట్, చుట్ట, బీడీ ఆర్పి వేయకుండా పడేయడంతో ప్రమాదాలు సంబవిస్తుంటాయి. ప్రకృతి వైపరిత్యాలతో జరిగే ప్రమాదాలు కొన్ని అయితే.. మానవ తప్పిదాలతో సంభవించే ప్రమాదాలే అధికమని అగ్నిమాపకశాఖ అధికారులు పేర్కొంటున్నారు. తగిన జాగ్రత్తలతో వీటిని అరికట్టవచ్చని, ప్రమాదం జరిగితే నష్టాన్ని నివారించవచ్చని చెబుతున్నారు.

అవగాహనతోనే..

ప్రజల్లో అవగాహన లేకపోవడంతోనే అగ్ని ప్రమాదాలు అధికంగా జరుగుతున్నాయి. అనపర్తి ఫైర్ స్టేషన్ పరిధిలో గత నాలుగు సంవత్సరాలు 242 అగ్ని ప్రమాదాలు జరిగాయి. రూ.19,19,73,468 నష్టం జరిగిందని అధికారులు వివరించారు. ప్రమాదాలపై ప్రజలు అవగాహన పెంచుకోవాలి. అగ్ని ప్రమాదం జరిగిన వెంటనే అగ్నిమాపక కార్యాలయానికి ఫోన్ చేయడం ద్వారా ప్రాణ, ఆస్తి నష్టాలను నివారించే వీలుంటుందని అధికారులు చెబుతున్నారు.

ఏప్రిల్ 14 నుంచి వారోత్సవాలు

1944 ఏప్రిల్ 14న బొంబాయి ఓడరేవులో ఆయుధాలు, గన్‌పౌడర్ కలిగిన నౌకలో అగ్ని ప్రమాదం సంభవించి అనేక నౌకలు, బిల్డింగ్‌లకు మంటలు వ్యాపించాయి. ఇందులో 336 మంది ప్రజలు, 66 మంది అగ్ని మాపక సిబ్బంది మృతి చెందారు. వారి సంస్మరణార్థం ఏప్రిల్ 14 నుంచి 20వ తేదీ వరకూ వారోత్సవాలు జరుపుకోంటున్నారు.

ప్రమాదాల నివారణ చర్యలు

- వంట గ్యాస్ వాడకం తర్వాత రెగ్యులేటర్‌ను ఆఫ్ చేయాలి. బయట నుంచి ఇంట్లోకి వచ్చినప్పుడు గ్యాస్ వాసన వస్తే లైట్లు, ఫ్యాన్ వంటివి వేయకుండా వెంటనే అగ్నిమాపక సిబ్బంది సమాచారం ఇవ్వాలి. సిగిరెట్, చుట్టు,బీడీ వెలిగించిన వారు పడేసేటప్పుడు పూర్తిగా ఆర్పి వేయాలి.
- ఇళ్లను వదలి వేళ్లే వారు కరెంట్ మెయిన్ స్విచ్ ఆఫ్ చేయాలి. దీంతో వేడికి షార్ట్ సర్క్యూట్ అయినా విద్యుత్ ఇంట్లోకి ప్రవేశించకుండా ఉంటుంది.
- వంట చేసే మహిళలు కాటన్ దుస్తులను ధరించాలి. అగ్గిపెట్టెలు, లైటర్లు, దీపాల నుంచి చిన్నారులను దూరంగా ఉంచాలి.

వంటింట్లో తెలుసుకోవాల్సినవి

- సిలిండర్‌ను ఎప్పుడూ ఆపి ఉంచుకోవాలి. పడుకోబెట్టడం వంటివి చేయరాదు.
- సిలిండర్ కంటే స్టవ్ ఎత్తులో ఉండేలా జాగ్రత్త తీసుకోవాలి.
- అనుమానం వచ్చినప్పుడు సిలిండర్‌పై కొన్ని నీళ్ల చల్లితే బుడగలు వచ్చేలా ఉంటే గ్యాస్ లీకయ్యే విషయం తెలుస్తుంది.


అనపర్తిలో అగ్నిప్రమాదాలపై అవగాహన కల్పిస్తున్న ఫైర్ సిబ్బంది

అవగాహన కల్పిస్తున్నాం



అగ్నిప్రమాదాల నివారణపై ప్రజలకు అవగాహన కల్పిస్తున్నాం, గ్యాస్ లీకైనప్పుడు మంటలను ఎలా ఆర్పాలో ప్రయోగాత్మకంగా చూపిస్తున్నాం. ప్రమాదాల నుంచి కాపాడుకునే మెలకువలు నేర్పిస్తున్నాం. దీంతో ప్రమాదాలను చాలా వరకు తగ్గిస్తున్నాం. గత నాలుగు సంవత్సరాల్లో రూ.35 కోట్లు విలువైన ఆస్తిని కాపాడాం. ప్రమాదాలు సంభవించిన వెంటనే అగ్నిమాపక కేంద్రానికి సమాచారం ఇవ్వాలి.

–జి.శ్రీనివాస్‌రెడ్డి, అగ్నిమాపక అధికారి అనపర్తి

క్లుప్తంగా

సత్తెమ్మను దర్శించిన ఎమ్మెల్యే


అమ్మవారిని దర్శించుకున్న ఎమ్మెల్యే సూర్యనారాయణరెడ్డి

బిక్కవోలు: కొంకుదురు గ్రామంలో ఉన్న సత్తెమ్మతల్లిని ఎమ్మెల్యే డాక్టర్ సత్తి సూర్యనారాయణరెడ్డి ఆదివారం దర్శించుకున్నారు. గ్రామంలోని పడాల వారి కుల దైవమైన సత్తెమ్మ తల్లీ సంబరం ఘనంగా నిర్వహించారు. అమ్మవారి గ్రామంలోని ఊరేగించారు. భక్తులు అమ్మవారిని దర్శించుకున్నారు. అనంతరం అన్నసమారాధన నిర్వహించారు. ఈ కార్యక్రమంలోని సొసైటీ అధ్యక్షుడు సత్తి నాగిరెడ్డి రాజా, ఎంపీటీసీ కొంకుదురు పీవీ పడాల రామకృష్ణారెడ్డి, పడాల వెంకరామారెడ్డి, పడాల సతీష్‌కుమార్ బదర్స్, బాబి, శ్రీనివాస్ రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

త్వరితగతిన ఇళ్ల నిర్మాణాలు


గృహనిర్మాణ అధికారులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే జక్కంపూడి రాజా

రాజానగరం: జగనన్న కాలనీల్లో చేపట్టిన ఇళ్ల నిర్మాణాలను త్వరితగతిన పూర్తి చేసేలా చర్యలు తీసుకోవాలని ఎమ్మెల్యే, వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు జక్కంపూడి రాజా అధికారులకు సూచించారు. రాజమహేంద్రవరంలోని ఆయన కార్యాలయంలో గృహనిర్మాణశాఖ అధికారులతో ఆదివారం సాయంత్రం నిర్వహించిన సమావేశంలో నియోజకవర్గంలో జరుగుతున్న ఇళ్ల నిర్మాణ పనులపై సమీక్షించారు. నియోజకవర్గంలోని మూడు మండలాల్లో ఫేజ్–1లో ఉన్న 52 జగనన్న లేఅవుట్లలో జరుగుతున్న ఇళ్ల నిర్మాణాల ప్రగతిని అధికారులు వివరించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ నిర్మాణాలు పూర్తయినచోట గృహస్తులకు అనువైన మౌలిక సదుపాయాలు కల్పించాలన్నారు. ఫేజ్–2లో ఇళ్ల నిర్మాణ పనులకు సంబంధిత లబ్దిదారులకు అనుమతులు మంజూరు చేయాలన్నారు. సొంత స్థలం ఉండి, ఇల్లు కట్టుకునేందుకు ముందుకు వచ్చిన వారికి కూడా రుణాలు మంజూరు చేసేలా చొరవ తీసుకోవాలన్నారు. సమావేశంలో గృహ నిర్మాణ శాఖ పీడీ జి.పరశురాం, డిప్యూటీ ఈఈ ఆర్‌వీ బాబు పాల్గొన్నారు.

పాఠశాల వార్షికోత్సవం


విద్యార్థినికి బహుమతి అందిస్తున్న దృశ్యం

బిక్కవోలు: సృజనాత్మక వెలుగు తీసేందుకు వార్షికోత్సవాలు అని ఏఎంసీ మాజీ చైర్మన్ జంగా వీర వెంకటసుబ్బారెడ్డి అన్నారు. బిక్కవోలులో జరిగిన ఓ ప్రైవేటు పాఠశాల వార్షికోత్సవం ఆయన పాల్గొని మాట్లాడారు. ఈ సందర్భంగా విద్యార్థులు సాంస్కతిక కార్యక్రమాలతో అలరించారు. అనంతరం వారికి బహుమతులను అందజేశారు. ఈ కార్యక్రమంలోని ఎస్సై పి.బుజ్జిబాబు తదితరులు పాల్గొన్నారు.

ఉత్సాహంగా ఎడ్లబళ్ల పోటీలు


ప్రథమస్థానంలో నిలిచిన నూనె రామసూర్యకు ట్రోఫీని బహూకరిస్తున్న నిర్వాహకులు

రాజానగరం: మండలంలోని సంపత్‌నగరంలో ఆదివారం జిల్లాస్థాయి ఎడ్లబళ్ల పోటీలు ఉత్సాహంగా జరిగాయి. నామవరం, సంపత్ నగరం, కోలమూరు, కడియం, తోకలంక, సీతారామపురం, మూలస్థానం నుంచి 14 జతల ఎడ్లబళ్లు ఈ పోటీలో పాల్గొన్నాయి. ఈ పోటీలను వైఎస్సార్ సీపీ మాజీ కన్వీనర్ మండారపు వీర్రాజు ప్రారంభించారు. గ్రామ దేవత గంటాలమ్మ పేరున ఈ పోటీలను ఏటా నిర్వహిస్తుంటారని సర్పంచ్ పెంటగట్ల రామకృష్ణ తెలిపారు. పోటీలలో నూనె రామసూర్య (సీతారామపురం), గెడ్డం ప్రసాద్ (తోకలంక), గోపు రామారావు (మూలస్థానం) ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాల్లో నిలిచారు. కార్యక్రమంలో ఉపసర్పంచ్ నల్లా దుర్గాప్రసాద్, ఎంపీటీసీ సభ్యుడు యాళ్ల సదానంద కిషోర్, మాజీ ఎంపీటీసీ సభ్యులు నక్కా రాజబాబు, లంక అమ్మిరాజు, కమిటీ మెంబర్ చిలకలపూడి ఆంజనేయులు, యాళ్ల రాంబాబు, పెంటగట్ల పుల్లయ్య, లంక రామకృష్ణ పాల్గొన్నారు.

నేడు శంకుస్థాపన

బిక్కవోలు: పందలపాక గ్రామంలో విద్యుత్ సబ్‌స్టేషన్ నిర్మాణానికి సోమవారం శంకుస్థాపన చేస్తున్నట్టు సొసైటీ అధ్యక్షుడు వైఎస్సార్ సీపీ గ్రామ శాఖ అధ్యక్షుడు సత్తి హరిప్రసాద్ రెడ్డి అన్నారు. రూ.2.68కోట్లతో నిర్మిస్తున్న ఈ సబ్‌స్టేషన్ పనులకు ఎమ్మెల్యే డాక్టర్ సత్తి సూర్యనారాయణరెడ్డి శంకుస్థాపన చేస్తారని తెలిపారు.

వైభవంగా పోలేరమ్మ తీర్థం


అమ్మవారిని దర్శించుకుంటున్న ఎమ్మెల్యే జక్కంపూడి రాజా

రాజానగరం: భూపాలపట్నంలో గ్రామదేవత పోలేరమ్మ జాతర, తీర్థమహోత్సవాలు వైభవంగా జరిగాయి. శనివారం జరిగిన జాతరలో స్థానిక ఎమ్మెల్యే, వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు జక్కంపూడి రాజా పాల్గొని అమ్మవారిని దర్శించుకున్నారు. ఈ సందర్భంగా ఉత్సవాల నిర్వాహకులు ఆయనకు ఘన స్వాగతం పలికారు. ఆదివారం తీర్థమహోత్సవం జరిగింది.

పంచామృతాభిషేకాలు

పెదపూడి: జి.మామిడాడలో ప్రసిద్ధి చెందిన ఉషా, ఛాయ, పద్మిని, సొంజ్ఞ సమేత సూర్యదేవునికి ఆదివారం పంచామృతాభిషేకాలు, పూజలు నిర్వహించారు. ఆలయ ప్రధాన అర్చకుడు రేజేటి వెంకటనరసింహాచార్యులు ఆధ్వర్యంలో పూజలు జరిగాయి. భక్తులు స్వామివారిని దర్శించుకున్నారు.

నేడు అభిషేకాలు

రంగంపేట: చంద్రేడు గ్రామంలోని కాత్యాయనీ సమేత చంద్రశేఖరస్వామి ఆలయంలో నందీశ్వరునికి సోమవారం అభిషేకాలు నిర్వహించనున్నట్టు ఆలయ అర్చకుడు మైలవరపు కృష్ణశర్మ తెలిపారు. ఈ అభిషేకాలు సాయంత్రం 5.30 గంటలకు ప్రారంభమవుతాయన్నారు.

పకడ్బందీగా ధాన్యం కొనుగోళ్లు

- జాయింట్ కలెక్టర్ తేజ్ భరత్
- ఎమ్మెల్యే సూర్యనారాయణరెడ్డితో కలిసి ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించిన జేసీ


ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న జేసీ తేజ్‌భరత్, ఎమ్మెల్యే సత్తి సూర్యనారాయణరెడ్డి

అనపర్తి: రబీ సీజన్‌లో రైతులకు ఇబ్బంది లేకుండా ధాన్యం కొనుగోళ్లు పకడ్బందీగా నిర్వహించాలని జిల్లా జాయింట్ కలెక్టర్ తేజ్‌భరత్ తెలిపారు. ఆదివారం స్థానిక గ్రామ సచివాలయం–5 పరిధిలోని రైతు భరోసా కేంద్రంలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ఎమ్మెల్యే డాక్టర్ సత్తి సూర్యనారాయణరెడ్డితో కలిసి ఆయన ప్రారంభించారు.

తొలి ధాన్యం కొనుగోలు కేంద్రం అనపర్తిలోనే..

జేసీ మాట్లాడుతూ జిల్లాలో తొలి ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని అనపర్తిలో ప్రారంభించామన్నారు. గత ఖరీఫ్‌లో ధాన్యం కొనుగోలులో ఏర్పడ్డ సమస్యలను అధిగమించి రబీ సీజన్‌లో ప్రభుత్వ నిబంధనలకు అనుగుణంగా నిర్దిష్టమైన ప్రమాణాలకు లోబడి ధాన్యం కొనుగుళ్లు నిర్వహిస్తామన్నారు. దీనిపై అధికారులు, సిబ్బందికి శిక్షణ కూడా ఇచ్చామన్నారు. దళారులు, మధ్యవర్తుల ప్రమేయం లేకుండా ధాన్యం కొనుగోలు ప్రణాళికబద్ధంగా జరుగుతాయన్నారు. జిల్లాలో 233 ధాన్యం కొనుగోలు కేంద్రాలు ప్రారంభిస్తామన్నారు. అనపర్తి మండలంలో మొత్తం 6,909 మెట్రిక్ టన్నుల ధాన్యం సేకరణ లక్ష్యంగా నిర్దేశించుకున్నట్టు చెప్పారు. ధాన్యం కొనుగోళ్ల విషయంలో గ్రామ వ్యవసాయ సహాయకులు(వీఏఏ), టెక్నికల్ అసిస్టెంట్లు, కీలక భూమిక పోషించాలని, ఈ విషయంలో నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. ధాన్యం అమ్మకాలు సాగించిన రైతులకు సంబంధించిన వివరాలను మిల్లర్లకు చేరవేయద్దని సిబ్బందికి సూచించారు. ప్రభుత్వ నిబంధనల మేరకు ధాన్యం కొనుగోలు నిర్వహిస్తామని, రైతుల వద్ద మిగిలిన ధాన్యం వారు బహిరంగ మార్కెట్‌లో విక్రయాలు జరిపే విషయంలో కూడా ప్రభుత్వం గిట్టుబాటు ధర అందించేందుకు వ్యవసాయశాఖ అధికారులు బాధ్యత తీసుకుంటారని తెలిపారు. అదేవిధంగా రైతులు సాగు చేసిన బొండాలు రకం ధాన్యానికి ప్రభుత్వం త్వరలో మద్దతు ధరను ప్రకటిస్తుందని, ఈ ధర రైతులకు అందేలా చూస్తామన్నారు. ఆన్‌లైన్ విధానంలోనే కొనుగోళ్లు జరుపుతామని జేసీ స్పష్టం చేశారు. ప్రభుత్వ నిర్దేశించిన నాణ్యతా ప్రమాణాలకు అనుగుణంగా ఉన్న ధాన్యాన్ని రైతుల నుంచి కొనుగోలు చేసిన 21 రోజుల్లో రైతు ఖాతాల్లో సొమ్ము జమ అవుతుందని చెప్పారు. ఇదిలా ఉండగా గన్ని బ్యాగ్‌లకు సంబంధించిన రిజిస్టర్లు ధాన్యం కొనుగోలు కేంద్రానికి చేరకపోవడంపై సంబంధిత అధికారులు, సిబ్బందిపై జేసీ ఆగ్రహం వ్యక్తం చేశారు.

సిబ్బంది నిర్లక్ష్యం వహిస్తే..

ఎమ్మెల్యే డాక్టర్ సత్తి సూర్యనారాయణరెడ్డి మాట్లాడుతూ రైతు సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయమని, సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి వ్యవసాయానికి వెన్నుదన్నుగా నిలుస్తున్నారని అన్నారు. గత ఖరీఫ్ అనుభవాలను దృష్టిలో ఉంచుకుని రైతులకు ఇబ్బందులు తలెత్తకుండా నిబంధనలు సడలించి రబీ ధాన్యం కొనుగోళ్లు జరిపేలా అధికారులు పటిష్టమైన చర్యలు తీసుకోవాలని కోరారు. ముఖ్యంగా రైతులు తమ సమీపంలో ఉన్న వేబ్రిడ్జ్‌ల వద్దే తూకాలు వేయించుకునేలా అధికారులు చర్యలు తీసుకోవాలని సూచించారు. ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో విధులు నిర్వహించే సిబ్బంది నిర్లక్ష్యం కారణంగా గత ఖరీఫ్ సీజన్‌లో రైతులు అనేక ఇబ్బందులు పడ్డారని, ఇదే పరిస్థితి పునరావృతమైతే ఉపేక్షించేది లేదని హెచ్చరించారు. అనపర్తి వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ సబ్బెళ్ల కృష్ణారెడ్డి మాట్లాడుతూ రైతుల సమస్యలను అధికారుల దృష్టికి తీసుకువచ్చారు. ఈ కార్యక్రమంలో జెడ్పీటీసీ సభ్యురాలు సత్తి గీతావరలక్ష్మి వెంకటరెడ్డి, ఎంపీపీ అంసూరి సూర్యనారాయణ, రాష్ట్ర రెడ్డి, భత్రాజుల కార్పొరేషన్ డైరక్టర్లు సత్తి రామకృష్ణారెడ్డి, షణ్ముఖి చిట్టిరాజు, డీఎం అనిల్‌కుమార్, డీఎస్‌ఓ పి.ప్రసాదరావు, డీఏఓ ఎస్.మాధవరావు, డీసీఓ నాగభూషణం, ఆర్డీఓ చైత్రవర్షిణి, ఏఓ బి.సురేష్‌కుమార్, ప్రజాప్రతినిధులు, రైతులు పాల్గొన్నారు.

సంక్షేమమే ధ్యేయంగా జగన్ పాలన

అనపర్తి: పేద ప్రజల సంక్షేమమే ధ్యేయంగా సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సుస్థిరమైన, సుపరిపాలన సాగిస్తున్నారని ఎమ్మెల్యే డాక్టర్ సత్తి సూర్యనారాయణ రెడ్డి అన్నారు. మండలంలోని మహేంద్రవాడ రజకుల పేటలో గ్రామ పంచాయతీ నిధులు రూ.5 లక్షలు, మండల పరిషత్ నిధులు రూ.5 లక్షలు మొత్తం రూ.10 లక్షలతో నిర్మించిన బీసీ కమ్యూనిటీ భవనాన్ని ఆదివారం ఆయన ప్రారంభించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ బడుగు బలహీన వర్గాల సంక్షేమమే కోరుతూ ప్రభుత్వం అనేక పథకాలు అమలు చేస్తున్నారన్నారు. రాబోయే ఎన్నికల్లో మంచి చేసే ప్రభుత్వాన్ని ఆశీర్వదించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎంపీటీసీ పడాల ధర్మారెడ్డి, ఉపసర్పంచ్ మల్లిడి గంగరాజు, సొసైటీ అధ్యక్షుడు తాడి వెంకట సత్యనారాయణ రెడ్డి, దేవస్థానం అధ్యక్షుడు సబ్బెళ్ల సత్తిరెడ్డి, పార్టీ గ్రామ కమిటీ కన్వీనర్ తేతలి వెంకటరెడ్డి, టి.రామారెడ్డి, రజక సంఘం నాయకులు పాల్గొన్నారు.

కందుకూరి వీరేశలింగం పంతులు జయంతి

పెదపూడి: రాజమహేంద్రవరంలోని హితకారిణి సమాజం డైరెక్టర్ వుండ్రు సత్యనారాయణ ఆధ్వర్యంలో కరకుదురులో ఆదివారం కందుకూరి వీరేశలింగం పంతులు జయంతిని నిర్వహించారు. ఎమ్మెల్యే సత్తి సూర్యనారాయణ రెడ్డి వీరేశలింగం చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. కార్యక్రమంలో పలువురు ప్రజాప్రతినిధులు, పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

శ్రీరామకృష్ణ సేవా సమితి నూతన కార్యవర్గం ఎన్నిక


నూతన అధ్యక్షుడు సుబ్బారెడ్డిని సత్కరించిన కార్యవర్గ సభ్యులు

అనపర్తి: స్థానిక శ్రీరామకృష్ణ సేవా సమితి నూతన అధ్యక్షుడిగా ఆంధ్రప్రదేశ్ పౌల్ట్రీ ఫెడరేషన్ ప్రధాన కార్యదర్శి పడాల సుబ్బారెడ్డి ఏడోసారి ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఆదివారం స్థానిక అనపర్తి ప్రాంతీయ కోళ్ల రైతుల సంక్షేమ సంఘం కల్యాణ మండపం సెమినార్ హాలులో సమితి సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో 2023–2024 సంవత్సరానికి గాను సమితి నూతన కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. సమితి అధ్యక్షుడు పడాల సుబ్బారెడ్డి అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో సమితి ఉపాధ్యక్షులుగా ప్రముఖ న్యాయవాది వీవీ ఆర్ సుబ్రహ్మణ్యం, చింతా శ్రీనివాసరెడ్డి, సత్తి వెంకట రెడ్డి, తేతలి సుందర రామారెడ్డి, సత్తి రామకృష్ణారెడ్డి, పీవైఎస్‌వీ సతీష్ లను ఎన్నుకున్నారు. ప్రధాన కార్యదర్శిగా నల్లమిల్లి సుబ్బారెడ్డి, కార్యదర్శులుగా తాడి చంద్రశేఖర్‌రెడ్డి, నల్లమిల్లి శ్రీనివాసరెడ్డి, కొవ్వూరి సత్తి రెడ్డి, మల్లిడి సురేంద్రరెడ్డి, మల్లిడి శ్రీనివాసరెడ్డి, కోశాధికారి దాట్ల ప్రతాప్ వర్మతోపాటు మరో 40 మంది సభ్యులుగా ఎన్నుకున్నారు. నూతన కార్యవర్గాన్ని రాజమహేంద్రవరం రామకృష్ణ మఠం అధ్యక్షుడు స్వామి పరిజ్ఞేయానందజీ మహరాజ్, రామకృష్ణ మిషన్ సభ్యుడు ఎం.దుర్గాప్రసాద్, ఎమ్మెల్యే డాక్టర్ సత్తి సూర్యనారాయణరెడ్డి, మాజీ ఎమ్మెల్యేలు నల్లమిల్లి శేషారెడ్డి, నల్లమిల్లి రామకృష్ణారెడ్డి, రెడ్డి సంక్షేమ సంఘం అధ్యక్షుడు సబ్బెళ్ల అమ్మిరెడ్డి, హైకోర్టు సీనియర్ న్యాయవాది నల్లమిల్లి శివారెడ్డి, పరమేశు బయోటెక్ ప్రైవేట్ లిమిటెడ్ చైర్మన్ తేతల ఉపేంద్రరెడ్డి, శ్రీ చక్ర ఆయిల్స్ అధినేత చింతా గోపాలకృష్ణారెడ్డి, జీబీఆర్ విద్యాసంస్థల అధినేత తేతలి కొండబాబు తదితరులు అభినందనలు తెలియజేశారు.

ప్రజలంతా సీఎం జగన్ వెంటే..

- ఎమ్మెల్యే డాక్టర్ సత్తి సూర్యనారాయణరెడ్డి
- కరకుదురులో గడపగడపకూ మన ప్రభుత్వం


కరకుదురులో ప్రభుత్వ పథకాలను వివరిస్తున్న ఎమ్మెల్యే సూర్యనారాయణరెడ్డి

పెదపూడి: ప్రజా సంక్షేమం, అభివృద్ధి కోసం పని చేస్తున్న ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి వెంటే రాష్ట్ర ప్రజలంతా ఉన్నారని, ఆయన్ను మరో మారు సీఎంగా గెలిపించేందుకు సిద్ధంగా ఉన్నారని ఎమ్మెల్యే డాక్టర్ సత్తి సూర్యనారాయణరెడ్డి అన్నారు. కరకుదురులో గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమం ఆదివారం నిర్వహించారు. ఎమ్మెల్యే గ్రామంలో ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను వివరించి, వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ గత టీడీపీ ప్రభుత్వంలో కేవలం టీడీపీ నాయకులు, కార్యకర్తలకే సంక్షేమ పథకాలు అందేవని, ప్రస్తుతం జగనన్న పాలనలో నేరుగా పేదల ఇంటి వద్దకే చేరుతున్నాయన్నారు. సీఎం జగన్ నవరత్నాలతో పేదల జీవితాల్లో వెలుగులు నింపారన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ కేతా తులసి, జెడ్పీటీసీ సభ్యురాలు పేపకాలయ వెంకటలక్ష్మి, సర్పంచి వుండ్రు చంద్రకళ, వైస్ ఎంపీపీ కర్రెద్ల వెంకన్న బాబు, హితకారిణి సమాజం డైరెక్టర్ వుండ్రు సత్యనారాయణ, పార్టీ మండల అధికార ప్రతినిధి వాసంశెట్టి మాధవ, మాజీ సర్పంచి సానా రాంబాబు, పార్టీ గ్రామ కన్వీనర్ పెమ్మనబోయిడి రాజు, పార్టీ మండల కన్వీనర్ గుత్తుల వెంకటరమణ తదితరులు పాల్గొన్నారు.

గాదరాడలో రూ.6.5 కోట్లతో అభివృద్ధి పనులు

- ఎమ్మెల్యే, వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు జక్కంపూడి రాజా
- ఉత్సాహంగా గడపగడపకూ..


గాదరాడలో మహిళతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే జక్కంపూడి రాజా

మధురపూడి: కోరుకొండ మండలం గాదరాడలో రూ.6.5 కోట్లతో అభివృద్ధి పనులు చేపట్టినట్టు ఎమ్మెల్యే, వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు జక్కంపూడి రాజా అన్నారు. ఆ గ్రామంలో ఆదివారం గడపగడపకూ మన ప్రభుత్వం కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా జక్కంపూడి రాజా మాట్లాడుతూ రాజానగరం నియోజకవర్గం అభివృద్ధికి చిరునామాగా మారిందన్నారు. గాదరాడను మోడల్ విలేజ్‌గా తీర్చిదిద్దుతానన్నారు. గ్రామాల్లో మౌలిక వసతులు కల్పిస్తున్న ఏకైక ప్రభుత్వం తమదేనన్నారు. దానిలో భాగంగానే మంచినీటి సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకున్నట్టు తెలిపారు. గ్రామంలో సచివాలయాలు, ఆర్‌బీకే, హెల్త్‌సెంటర్లు, ఏర్పాటు చేశామన్నారు. గతంలో అభివృద్ధి పనుల నిర్వహణకు కొందరు అడ్డుతగిలేవారన్నారు. ఆ వ్యక్తులు పార్టీ నుంచి బయటకు వెళ్లడంతో అభివృద్ధి కార్యక్రమాలకు అడ్డుండదన్న ఆశాభావాన్ని వ్యక్తం చేశారు. పార్టీ మండల కన్వీనర్ అడపా కనకరాజు, సర్పంచుల సమాఖ్య మండల అధ్యక్షుడు కడియాల పాపారావు, హరిబోలు చినబాబు, పాలెం నాగవిష్ణు, గొల్లపల్లి అశోక్ పాల్గొన్నారు.

వారి స్నేహానికి 44 వసంతాలు


ఆత్మీయ సమ్మేళనం పేరుతో కలిసిన పూర్వ విద్యార్థులు

అనపర్తి: వారి స్నేహానికి వయసు నాలుగు దశాబ్దాలపై మాటే.. నలభై నాలుగు సంవత్సరాల క్రితం స్థానిక శ్రీరామారెడ్డి జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాలలో పదో తరగతి చదివిన పూర్వ విద్యార్థులంతా కలుసుకున్నారు. దానికి స్థానిక జీబీఆర్ కళాశాల సమీపంలోని పద్మావతినగర్‌లో గల పద్మావతి ప్యాకింగ్ ప్రొడక్ట్స్ ఆవరణం వేదికయ్యింది. 1979–80 సంవత్సరంలో పదో తరగతి చదివిన పూర్వ విద్యార్థులు గ్రామానికి చెందిన వ్యాపారవేత్త ద్వారంపూడి నాగేంద్ర సత్యనారాయణరెడ్డి(జొన్నాడ దొరబాబు), కర్రి ఆదిరెడ్డిల ఆధ్వర్యంలో ఆదివారం నిర్వహించిన ఆత్మీయ సమ్మేళనంలో కలిశారు. నలభై నాలుగు సంవత్సరాల క్రితం కలిసి విద్యాభ్యాసం చేసి ప్రస్తుతం వివిధ వృత్తుల్లో, వ్యాపార, ఉద్యోగాల్లో ఉన్న వీరు ఒక చోట కలిసుకుని అలనాటి మధుర స్మృతులను నెమరవేసుకున్నారు. ఉదయం నుంచి సాయంత్రం వరకు సందడిగా చేశారు. అంతకు ముందుగా తమకు విద్యాబుద్ధులు నేర్పిన గురువులు సర్వేశ్వరరావు, వంకాయల సూర్యనారాయణమూర్తి, వంక సూర్యనారాయణమూర్తిలను ఘనంగా సత్కరించి గురువుల ఆశీస్సులు అందుకున్నారు. అదేవిధంగా ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న ఎమ్మెల్యే డాక్టర్ సత్తి సూర్యనారాయణరెడ్డిని ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో ఎన్‌సీఆర్ బాబుల్‌రెడ్డి పాల్గొన్నారు.

పార్టీలకతీతంగా సంక్షేమ పథకాలు


సీతానగరంలో జగనన్నే మా భవిష్యత్ కార్యక్రమం నిర్వహిస్తున్న ఉపసర్పంచ్ రామకృష్ణ

సీతానగరం: రాష్ట్రంలో పార్టీలకతీతంగా అర్హులందరికీ సంక్షేమ పథకాలు అందిస్తున్న ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని ఆశీర్వదించాలని సీతానగరం పంచాయతీ ఉప సర్పంచ్, గృహసారథి ద్వారంపూడి రామకృష్ణ అన్నారు. ఆదివారం గృహసారథి ముప్పన్న గౌరి, సచివాలయ కన్వీనర్ బైర్రాజు మురళీరాజుతో గ్రామంలో కలిసి జగనన్నే మా భవిష్యత్ కార్యక్రమం నిర్వహించారు. ఇంటింటికి వెళ్లి ప్రభుత్వ పథకాలను వివరించారు. నాలుగేళ్లుగా వైఎస్సార్ సీపీ చేసిన అభివృద్ధిని తెలిపారు. బుక్‌లెట్‌లో ప్రశ్నలకు ప్రజల నుంచి జవాబులు రాబట్టి, మిస్డ్ కాల్ చేశారు. అనంతరం ఇంటి వద్ద, సెల్‌ఫోన్లకు మా నమ్మకం నువ్వే జగనన్న స్టికర్లు అతికించారు.

ఘనంగా వేల్పులమ్మ తీర్థం

రంగంపేట: చంద్రేడు గ్రామంలోని వేల్పులమ్మ తల్లి వార్షిక తీర్థమహోత్సవం ఆదివారం ఘనంగా జరిగింది. ఉదయం అమ్మవారిని విశేషంగా అలంకరించి ప్రత్యేక పూజలు చేశారు. అమ్మవారి స్వరూపాలైన గరగలను గ్రామంలో ఇంటింటికీ ఊరేగించారు. ఈ సందర్భంగా గ్రామస్తులు చలివిడి, వడపప్పు, నైవేద్యం అమ్మవారికి సమర్పించారు. భక్తులు అమ్మవారిని దర్శించుకుని మొక్కులు చెల్లించుకున్నారు. మ్యూజిల్ బ్యాండు, కోలాటం, బాణసంచాలతో తీర్థం అంగరంగ వైభవంగా నిర్వహించారు.

వృద్ధురాలిని కొట్టి.. బంగారం అపహరించి..

బిక్కవోలు: బలభద్రపురం గ్రామంలోని గుర్తి తెలియని వ్యక్తి వృద్ధురాలిని కొట్టి బంగారం చోరీ చేసిన ఘటనపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై పి.బుజ్జిబాబు తెలిపారు. ఆదివారం ఆయన మాట్లాడుతూ బలభద్రపురం గ్రామానికి చెందిన సేనాపతి సత్యవతి, ఆమె కుమారుడు, కోడలుతో బలబద్రపురం కొత్తపేట ఏరియాలోని ఇంట్లో ఉంటున్నారు. అయితే కోడలు అదే గ్రామంలోని అమ్మగారి ఇంటి వెళ్లింది. కుమారుడు రైస్‌మిల్ పనిలోకి వెళ్లడంతో కేవలం ఒక్కతే ఇంట్లో రాత్రి నిద్రిస్తుండగా ఒక్కసారి శబ్దం రావడంతో వెళ్లి చూడగా ఎవరో గుర్తు తెలియని వ్యక్తి ఇంటి బీరువాను తెరవడం గమనించింది. ఆమె అరవడంతో దొంగ ఆమె నోటిలో గుడ్డలు కుక్కి మోహం మీద గుద్దుగా ఆమె పడిపోయింది. మరసటి రోజు ఆదివారం ఉదయం కోడలు ఇంటి వచ్చి చూడగా సోమ్మసిల్లి ఉన్న అత్తను లేపిందన్నారు. దీంతో ఇంటి బీరువాలో మూడు కాసులు బంగారం మంగళసూత్రాలు తాడు దొంగలించినట్లు తెలిపారు. దీనిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తునట్టు ఆయన తెలిపారు.

వ్యాయామంతో ఆరోగ్యం


సైకిల్ మారథాన్‌లో పాల్గొన్న విద్యార్థులు

రాజానగరం: ఆరోగ్య సంరక్షణ కోసం ప్రతి ఒక్కరూ రోజూ కొంత సమయాన్ని వ్యాయామానికి కేటాయించాలని గైట్ స్కూల్ ఆఫ్ ఫార్మసీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఎం.ధనరాజ్ అన్నారు. ఎన్ఎస్ఎస్ పీఓ షేక్ మీరా ఆధ్వర్యంలో క్యాంపస్‌లో ఆదివారం నిర్వహించిన సైకిల్ మారథాన్‌ను ఆయన ప్రారంభించారు. సుమారు 30 విద్యార్థులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.